# కేసీఆర్ చేస్తే తప్పు.. రేవంత్ చేస్తే రైట్!


v6velugu.com
సన్నవడ్ల సాగుతో రైతులకు మస్తు నష్టాలు.!
October 14, 2020
సన్నవడ్ల సాగుతో రైతులకు మస్తు నష్టాలు..!
- సర్కారు పిలుపుతో 24 లక్షల ఎకరాల్లో సాగు
- చీడపీడలతో పెరిగిన పెట్టుబడులు
- ఎకరాకు రూ.10 వేలకు పైగా అదనపు ఖర్చు
- దొడ్డు రకాలతో పోలిస్తే తగ్గిన దిగుబడులు


v6velugu.com
సన్నాలకు ఊతం .. సన్న వడ్ల సాగుకు సర్కారు ప్రోత్సాహం
May 22, 2024
సన్నాలకు ఊతం
సన్న వడ్ల సాగుకు సర్కారు ప్రోత్సాహం
- సన్నాలకు ఊతం .. సన్న వడ్ల సాగు సర్కారు ప్రోత్సాహం
- క్వింటాల్ కు రూ. 500 బోనస్
- రేషన్ షాపుల్లోనూ పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు
- ఇన్నాళ్లూ డిమాండ్‌కు తగ్గట్టు లేని సన్నాల సాగు
- ఇదే అదునుగా సన్న బియ్యం రేట్లు పెంచుతున్న వ్యాపారులు

### కాంగ్రెస్ అనుకూల మీడియా రెండు నాల్కల ధోరణి

రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచితే రియల్ కుదేల్ అని నాడు కథనాలు

నేడు చార్జీలు పెరిగితే రియల్ భూమ్ వస్తుందంటూ వార్తలు

సన్నవడ్లతో రైతులకు నష్టాలంటూ నాడు మొసలి కన్నీరు

ఇప్పుడు 'సన్నాలకు ఊతం' అంటూ సన్నాయి నొక్కులు

హైదరాబాద్, మే 23 (నమస్తే తెలంగాణ): 'సన్నరకం వడ్లు సాగుచేయండి' అని కేసీఆర్ ప్రభుత్వం 2020లో ప్రకటించింది. అంతే.. అప్పట్లో కాంగ్రెస్ అనుకూల మీడియా తీవ్ర వ్యతిరేక వార్తలు గుప్పించింది. సన్నరకం సాగుతో రైతులకు పెట్టుబడి వ్యయం పెరిగిందని, దిగుబడి తగ్గిందని, నష్టం కలుగుతుందంటూ మొసలి కన్నీరు కార్చింది. 'సన్నరకం వడ్లకు మాత్రమే క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తాం' అని రేవంత్ ప్రభుత్వం ప్రకటించగానే.. 'సన్నాలకు ఊతం' అంటూ అదే చానల్, పత్రిక సన్నాయి నొక్కులు నొక్కుతున్నది. రాష్ట్రంలో కాంగ్రెస్ అనుకూల మీడియా రెండు నాల్కల ధోరణికి ఇదొక ఉదాహరణ. కేసీఆర్ ప్రభుత్వం 2020లో సన్నవడ్లను సాగుచేయాలని భావించి వ్యవసాయ అధికారుల ద్వారా రైతులకు అవగాహన కల్పించింది. అవసరమైతే మద్దతు ధరకు రూ.100 బోనస్ ఇచ్చి అయినా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని కేసీఆర్ చెప్పారు. దీంతో కాంగ్రెస్ నేతకు చెందిన ఓ పత్రిక, టీవీలో 'రైతులకు మస్తు కష్టాలు' అంటూ మొసలి కన్నీరు కార్చింది. దొడ్డు వడ్లతో పోల్చితే ఎకరాకు రూ.10 వేల వరకు అదనంగా పెట్టుబడి అవుతున్నదని, 4-5 క్వింటాళ్ల దిగుబడి తక్కువగా వస్తున్నదని, పంటకాలం నెల రోజులు ఎక్కువగా ఉన్నదంటూ వరుసగా కథనాలు రాసింది. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం సన్నవడ్లకు మాత్రమే రూ.500 బోనస్ ఇస్తామని ప్రకటిస్తే.. అదే మీడియా 'సన్నాలకు ఊతం' అంటూ సన్నాయి నొక్కులు మొదలుపెట్టింది. బోనస్ ప్రకటనతో రైతులు సన్నాల సాగువైపు మొగ్గుచూపుతారంటూ వార్తలు వడ్డించింది. చీడపీడలు, రూ.10వేలు అదనంగా పెట్టుబడి, తక్కువ దిగుబడి వంటి సాకులను పక్కన పడేసింది. ఇక సీఎం రేవంత్ రెడ్డికి అత్యంత ప్రీతిపాత్రమైన మరో మీడియా సంస్థదీ ఇదే వ్యవహారం. కేసీఆర్ ప్రభుత్వం గతంలో రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచిన సమయంలో వ్యతిరేక వార్తలను గుప్పించింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఏడేండ్లపాటు రియల్ ఎస్టేట్ రంగాన్ని, భూముల ధరలు విపరీతంగా పెరిగిన తర్వాతే కేసీఆర్ ప్రభుత్వం రిజిస్ట్రేషన్ చార్జీలను సవరించింది. తర్వాత మరోసారి సవరణ చేపట్టింది. ఆ సమయంలో సదరు పత్రిక రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ రంగం కుదేలవుతుందని, క్రయవిక్రయాలు పడిపోతాయంటూ వరుసగా కథనాలు గుప్పించిందని బీఆర్ఎస్ నేతలు చెప్తున్నారు. తాజాగా రాష్ట్రంలోని భూముల ధరలు, రిజిస్ట్రేషన్ చార్జీలను సవరించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు జారీచేశారు. మరుసటి రోజే ఆ పత్రిక.. ధరల పెంపుతో రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ రంగానికి కొత్త ఊపు వస్తుందంటూ ఆకాశానికి ఎత్తేసింది. ఒకప్పుడు క్రయవిక్రయాలు పడిపోతాయన్న చేతితోనే.. ఇప్పుడు రాష్ట్రానికి ఆదాయం పెరుగుతుందంటూ తిప్పిరాసింది. ఇలా అబద్ధపు రాతలతో ప్రజలను వంచిస్తూ, ఎలాంటి విలువలు పాటిస్తున్నట్టో ఆత్మపరిశీలన చేసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. దీన్ని బట్టి కాంగ్రెస్ అనుకూల మీడియా కేసీఆర్ ప్రభుత్వంపై ఉద్దేశపూర్వకంగానే విష ప్రచారం చేసిందని తెలంగాణవాదులు మండిపడుతున్నారు. కేసీఆర్ ఏం చేసినా తప్పు అని ప్రచారం చేసి.. ఇప్పుడు రేవంత్ ఏం చేసినా రైట్ అంటూ తలూపుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## 5 నెలల్లో ఏసీబీ వలలో 70 మంది అధికారులు

హైదరాబాద్, మే 23 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో కేవలం ఐదు నెలల్లోనే దాదాపు 70 మంది అధికారులు లంచాలు తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డారు. దీనిబట్టి అవినీతి, లంచాలు ఏస్థాయిలో పెరిగిపోతున్నాయో అర్థమవుతున్నది. గత ప్రభుత్వ హయాంలో లంచాలు తీసుకోవడానికి అధికారులు భయపడేవాళ్లు. ప్రభుత్వ మారడంతో కొందరు అధికారులు మళ్లీ లంచాల అవతారమెత్తుతున్నారు. దొరికినకాడికి దండుకుంటున్నారు. ఇటు లంచాలు ఇవ్వలేక, అటు పనులుగాక చాలా మంది ఏసీబీకి ఫిర్యాదు చేస్తున్నారు. దీంతో రంగంలోకి దిగుతున్న ఏసీబీ అధికారులు పక్కా ప్రణాళికతో పట్టుకుంటున్నారు. కోర్టుకు సమర్పించేందుకు రహస్యంగా వీడియోలు సైతం తీస్తున్నారు. అరెస్టులతో సరిపెట్టకుండా వెంటనే వారి ఆస్తులు, బినామీల వివరాలు ఆరా తీస్తున్నారు. వెనువెంటనే సోదాలు కూడా చేపడుతున్నారు. లంచాధికారులు అక్రమంగా సంపాదించిన డబ్బులు, బంగారం, భూములు, స్థిర, చరాస్తులను లెక్కకట్టి కోర్టుకు వివరిస్తున్నారు. పక్కా ఆధారాలు సమర్పించడంతో కోర్టు సైతం శిక్షలు విధిస్తున్నది. ఐదు నెలల్లో 70 మంది అధికారులు ఏసీబీకి చిక్కగా.. అందులో 5 కేసులు ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టుకున్న కేసులున్నాయి.

## ఇంటి నంబర్ ఇచ్చేందుకు 10వేలు

- ఏసీబీ వలలో జీహెచ్‌ఎంసీ అధికారి
- రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డ ఎల్బీనగర్ ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్ విజయ భార్గవకృష్ణ



ఎల్బీనగర్ , మే 23 : ఇంటి నంబర్, ట్యాక్స్ అసెస్‌మెంట్ చేసేందుకు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు గురువారం రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. రంగారెడ్డి జిల్లా రేంజ్ అవినీతి నిరోధక శాఖ డీఎస్పీ ఆనంద్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కర్మన్‌ఘాట్‌లో ఓ వ్యక్తి ఇంటిని నిర్మించుకుని ఇంటి నెంబర్, ప్రాపర్టీ ట్యాక్స్ అసెస్‌మెంట్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నాడు. అందుకవసరమైన ఫీజు కూడా చెల్లించాడు. అయినా ఇంటి నంబర్ రాకపోవడంతో సాయం కోసం తన స్నేహితుడు జీహెచ్‌ఎంసీలో అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్‌గా పనిచేసి రిటైర్డ్ అయిన నర్సింహారెడ్డిని సంప్రదించాడు. ఇద్దరూ కలిసి జీహెచ్‌ఎంసీ ఎల్బీనగర్ సర్కిల్ కార్యాలయంలో ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్ విజయ భార్గవ కృష్ణను కలిసి సమస్య వివరించారు. పనికావాలంటే రూ.10వేలు లంచం ఇవ్వాలంటూ డిమాండ్ చేశాడు. అయితే, తాను కూడా ఇదే విభాగంలో పనిచేసి రిటైర్డ్ అయ్యాయని, మమ్మల్ని కూడా లంచం అడుగుతారా అని ప్రశ్నించినా డబ్బులు ఇస్తే తప్ప పని జరగదంటూ చెప్పడంతో నర్సింహారెడ్డి ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశాడు. దీంతో రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు విజయ భార్గవ కృష్ణ రూ. 10వేలు లంచం తీసుకుంటుండగా పట్టుకున్నారు.కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఆనంద్‌కుమార్ తెలిపారు.

## భూమి పట్టా చేసేందుకు 20వేలు

### లంచం తీసుకుంటుండగా పట్టుకున్న అధికారులు



డిప్యూటీ తహసీల్దార్ భరణిబాబు

చర్ల, మే 23 : ఓ రైతు నుంచి లంచం తీసుకుంటుండగా డిప్యూటీ తహసీల్దార్‌ను ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ఈ ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండల కేంద్రంలో గురువారం చోటుచేసుకున్నది. ఉమ్మడి ఖమ్మం జిల్లా ఏసీబీ డీఎస్పీ వై రమేశ్ కథనం ప్రకారం.. చర్ల మండలం దండుపేటకు చెందిన రైతు కర్ల రాంబాబు మూడెకరాల రెండు గుంటల భూమిని కొనుగోలు చేశారు. దీన్ని తన భార్య రాజమ్మ పేరిట పట్టా చేయించడానికి గతంలో ఇన్‌చార్జి తహసీల్దార్‌గా ఉన్న డిప్యూటీ తహసీల్దార్ భరణిబాబును కలిశారు. ఆ భూమిని పట్టా చేసేందుకు భరణిబాబు రూ.50 వేలు డిమాండ్ చేయగా రూ.20 వేలకు ఒప్పందం కుదిరింది. ఆ మేరకు రాంబాబు నుంచి డిప్యూటీ తహసీల్దార్ రూ.20 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

## అవినీతి కేసులో ఉద్యోగికి నాలుగేండ్ల జైలు

కరీంనగర్ కోర్టుచౌరస్తా, మే 23 : ఎరువుల దుకాణం అనుమతి కోసం దరఖాస్తు చేసుకున్న వ్యక్తి వద్ద లంచం తీసుకుంటూ పట్టుబడ్డ నేరంలో నిందితుడైన అధికారి అన్నారెడ్డి ప్రాణవేందర్‌రెడ్డికి నాలుగేండ్ల జైలు శిక్షతోపాటు రూ.6 వేల జరిమానా విధిస్తూ కరీంనగర్ ఏసీబీ ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి కుమార్‌వివేక్ గురువారం తీర్పునిచ్చారు. కరీంనగర్ జిల్లా రామడుగు మండలం వెలిచాలకు చెందిన దైవాల శ్రీనివాస్ 2013 ఆగస్టు 27న గ్రామంలో ఎరువుల దుకాణం అనుమతి కోసం కరీంనగర్‌లోని అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ ఆఫీసులో దరఖాస్తు చేసుకున్నారు. కరీంనగర్ ఏడీ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ అన్నారెడ్డి ప్రాణవేందర్‌రెడ్డి.. శ్రీనివాస్ దరఖాస్తును పైఅధికారులకు పంపి అనుమతి ఇప్పించేందుకు రూ.3 వేల లంచం డిమాండ్ చేశాడు. ఈక్రమంలో 2013 సెప్టెంబర్ 5న శ్రీనివాస్ నుంచి లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకొని కేసు నమోదుచేశారు. సాక్ష్యాధారాలు పరిశీలించిన జడ్జి వివేక్ కుమార్ నిందితుడు ప్రాణవేందర్‌రెడ్డికి నాలుగేండ్ల జైలు శిక్షతోపాటు రూ.6 వేల జరిమానా విధిస్తూ గురువారం తీర్పునిచ్చారు. ప్రస్తుతం ప్రాణవేందర్‌రెడ్డి గంగాధర వ్యవసాయ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నట్టు తెలిసింది.

# తుదిదశకు ఓట్ల లెక్కింపు ఏర్పాట్లు

- రాష్ట్రవ్యాప్తంగా 2373 టేబుల్స్ ద్వారా కౌంటింగ్
- విధుల్లో మూడువేల సిబ్బంది
- మల్కాజ్‌గిరిలో అత్యధికంగా 178 కౌంటింగ్ టేబుల్స్
- పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు ప్రత్యేకం
- జూన్ మొదటి వారమంతా ఓట్ల లెక్కింపే
- పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్న ఈసీ

### చేవెళ్ల పార్లమెంట్ పరిధిలో..

చేవెళ్ల పార్లమెంట్ పరిధిలో ఏడు నియోజకవర్గాలుండగా, మూడు నియోజకవర్గాల్లో అత్యధిక పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. దీంతో అక్కడ ఎక్కువ సంఖ్యలో టేబుల్స్ ఏర్పాటు చేస్తున్నారు.

### చేవెళ్ల పార్లమెంట్ పరిధిలో 164 కౌంటింగ్ టేబుల్స్

| నియోజకవర్గం | పోలింగ్ స్టేషన్లు | టేబుళ్లు |
|---|---|---|
| మహేశ్వరం | 511 | 28 |
| రాజేంద్రనగర్ | 535 | 28 |
| శేరిలింగంపల్లి | 622 | 28 |

మిగిలిన నాలుగు నియోజకవర్గాల్లో 14 చొప్పున, పోస్టల్ బ్యాలెట్ లెక్కింపునకు 24 టేబుల్స్ ఏర్పాటు చేస్తున్నారు.

### మొత్తం పోలింగ్ కేంద్రాలు 3,226

| నియోజకవర్గం | పోలింగ్ స్టేషన్లు | టేబుళ్లు |
|---|---|---|
| ఎల్బీనగర్ | 570 | 28 |
| మేడ్చల్ | 580 | 28 |
| మల్కాజిగిరి | 411 | 20 |
| కుత్బుల్లాపూర్ | 582 | 28 |
| కూకట్‌పల్లి | 417 | 20 |
| ఉప్పల్ | 407 | 20 |
| కంటోన్మెంట్ | 232 | 14 |
| పోస్టల్ బ్యాలెట్ కోసం | 20 | |
| మొత్తం | 178 | |

హైదరాబాద్, మే 23 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు తుది దశకు చేరుకున్నాయి. జూన్ 4 మంగళవారం ఉదయం 8 గంటల నుంచి 33 ప్రాంతాల్లో లెక్కింపు ప్రారంభకానుండగా, ఇందుకోసం 9445 మంది సిబ్బందిని నియమించారు. 2373 టేబుళ్లు ఏర్పాటు చేశారు. రాష్ట్రంలోని 17 లోక్‌సభ నియోజకవర్గ స్థానాల కోసం 525 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. అత్యధికంగా సికింద్రాబాద్‌లో 45 మంది అభ్యర్థులు పోటీ చేశారు. రాష్ట్రంలో 65.67 శాతం పోలింగ్ జరుగగా, 2.20 కోట్ల మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ సారి రాష్ట్రవ్యాప్తంగా 2.08 లక్షల పోస్టల్ బ్యాలెట్ ఓట్లు పోలవగా, లెక్కింపునకు అధిక సమయం పట్టే అవకాశమున్నది. ఈవీఎంలు, పోస్టల్ బ్యాలెట్ ఓట్లను విడివిడిగా లెక్కించనున్నారు. ఓట్ల లెక్కింపు టేబుల్ వద్ద ఒక్కో అభ్యర్థికి ఒక ఏజెంట్‌ను అనుమతిస్తారు. ఫలితాలు వెలువడేందుకు పదిరోజులు మాత్రమే ఉండడంతో ప్రజలు, అభ్యర్థులు ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు.

#### జూన్‌లో వరుసగా ఓట్ల లెక్కింపు..

ఈ నెలలో రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికలతోపాటు మరో రెండు చట్టసభలకు ఎన్నికలు జరిగాయి. మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల శాసనమండలికి ఉపఎన్నిక, లోక్‌సభ ఎన్నికలు జరుగగా, ఈ నెల 27న నల్లగొండ, వరంగల్, ఖమ్మం శాసనమండలి స్థానానికి ఉపఎన్నిక నిర్వహించనున్నారు. వీటన్నింటి ఓట్ల లెక్కింపును జూన్ మొదటివారంలో చేపట్టనున్నారు. మహబూబ్‌నగర్ ఉపఎన్నిక ఓట్ల లెక్కింపు జూన్ 2, లోక్‌సభ ఎన్నికల లెక్కింపు జూన్ 4, గ్రాడ్యుయేట్ ఉపఎన్నిక లెక్కింపు జూన్ 5న నిర్వహించనున్నారు.

#### మూడు నియోజకవర్గాల్లో మొదట పూర్తి..

రాష్ట్రంలో 35,809 పోలింగ్ కేంద్రాలు ఉండగా, మొదట భద్రాచలం, అశ్వారావుపేట, చార్మినార్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో కౌంటింగ్ పూర్తికానున్నది. శేరిలింగంపల్లి నియోజకవర్గంలో చివరి లెక్కింపు పూర్తి కానున్నది. అతితక్కువగా భద్రాచలంలో 176, అశ్వరావుపేటలో 184 పోలింగ్ కేంద్రాలు ఉండగా మొత్తం 13 రౌండ్లలో, చార్మినార్‌లో 198 కేంద్రాల్లో 14 రౌండ్లలో లెక్కింపు పూర్తి కావచ్చని అంచనా వేస్తున్నారు. శేరిలింగంపల్లి నియోజవకర్గంలో అత్యధికంగా 622 పోలింగ్ కేంద్రాలుండగా, 23 రౌండ్లలో లెక్కింపు చేయనున్నారు.

#### మల్కాజిగిరిలో అత్యధిక టేబుల్స్...

మల్కాజ్‌గిరి లోక్‌సభ పరిధిలో అత్యధిక పోలింగ్ స్టేషన్‌లు ఉండటంతో కౌంటింగ్ ఆలస్యం కాకుండా అధికారులు ఎక్కువ టేబుల్స్‌ను ఏర్పాటు చేస్తున్నారు.

## విద్యుదాఘాతంతో తల్లీకూతుళ్ల మృతి

### కరీంనగర్ జిల్లా చింతకుంట ఇటుక బట్టీల్లో ఘటన

రాంనగర్, మే 23: కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలం చింతకుంటలోని ఇటుక బట్టీల్లో పనిచేసే తల్లీకూతుళ్లు విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసుల కథనం ప్రకారం.. ఒడిశాకు చెందిన విద్యాధర్ బిందానికి ఇద్దరు భార్యలు. మొదటి భార్య చింతకుంటలోని ఇటుకబట్టీలో పనిచేస్తూ అక్కడే కూతురు బాబీ బిందాని (18), కొడుకు దశరథ్ బిందానితో కలిసి ఉంటున్నది. విద్యాధర్ చిన్న భార్యతో కలిసి వేరే ఇంట్లో ఉంటూ వేరే ఇటుక బట్టీలో పని చేసుకుంటున్నాడు. కాగా సమీపంలో ఉండే జగన్నాథ్ అనే వ్యక్తి పనికి పోయేందుకు గురువారం ఉదయం బేని బిందాని ఇంటికి వెళ్లాడు. తలుపు తట్టడంతో విద్యుత్తు షాక్ రాగా వెంటనే కేకలు వేసి విద్యాధర్‌కు సమాచారం ఇచ్చాడు. అక్కడికి చేరుకున్న విద్యాధర్ కరెంటు వైర్లు తొలగించి లోనికి వెళ్లి చూడగా అతని పెద్ద భార్య బేని బిందాని, కూతురు బాబి బిందాని విద్యుత్తు షాక్‌తో మృతిచెంది ఉన్నారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించగా వారు అక్కడికి చేరుకొని మృతదేహాలను పోస్టుమార్టం కోసం కరీంనగర్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు కొత్తపల్లి ఎస్సై సాంబమూర్తి తెలిపారు.

# హేమ డ్రామా.. బట్టబయలు!

- రేవ్‌పార్టీ కేసులో ట్విస్టులు
- సినిమాను తలపించేలా మలుపులు
- హేమ డ్రగ్స్ తీసుకున్నట్టు నిర్ధారణ
- పార్టీకి వెళ్లినట్టు ఆధారాలు చూపిన పోలీసులు
- పార్టీలో పాల్గొన్న 103 మందికి నార్కొటిక్ పరీక్షలు
- 86 మందికి పాజిటివ్.. ఇందులో 27 మంది మహిళలే
- మరో తెలుగు నటి ఆషీరాయ్ ఉన్నట్టు పోలీసుల వెల్లడి

### పార్టీలో పేరు మార్చుకున్న హేమ

బెంగళూరు రేవ్ పార్టీకి హాజరైనప్పటికీ, తాను వెళ్లలేదని నటి హేమ ధైర్యంగా పలు వీడియోలు విడుదల చేసింది. దీనికి కారణం పార్టీ హాజరుపట్టికలో ఆమె తన పేరును కృష్ణవేణిగా పేర్కొనడమేనని పోలీసు అధికారి ఒకరు తెలిపారు. సినిమాల్లోకి రాకముందు హేమ అసలు పేరు కృష్ణవేణి. ఇదే పేరును డ్రగ్స్ పార్టీ రిజిస్టర్‌లో పేర్కొన్నది. తర్వాత హేమ ఫొటోలను చూసిన వారు ఆమె ఎవరో గుర్తుపట్టడం, విమాన ప్రయాణ టికెట్లను పోలీసులు బయటపెట్టడంతో అసలు విషయం బయటపడింది. అలాగే, పోలీసులు విడుదల చేసిన హేమ ఫొటోలోని డ్రెస్, ఆమె విడుదల చేసిన వీడియోల్లోని డ్రెస్ ఒకేవిధంగా ఉండటంతో ఆమె పార్టీకి వెళ్లినట్టు తేలింది. ఆ పార్టీకి హాజరయ్యే వారికి ఎంట్రీ ఫీజుగా రూ.2 లక్షలను నిర్వాహకులు వసూలు చేసినట్టు సమాచారం.

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, మే 23 (నమస్తే తెలంగాణ): బెంగళూరు రేవ్ పార్టీ కేసు కొత్త మలుపులతో క్రైమ్ థ్రిల్లర్ సినిమాను తలపిస్తున్నది. నిన్నటివరకూ తాను పార్టీకి వెళ్లలేదని వీడియోల్లో బుకాయించిన తెలుగు సినీ నటి హేమ పార్టీకి వెళ్లడమే కాదు మాదకద్రవ్యాలనూ (డ్రగ్స్) సేవించినట్టు తేలింది. అసలు పేరు కృష్ణవేణిగా అక్కడి రిజిస్టర్‌లో రాసినందన ఎవరూ గుర్తు పట్టరని ఆమె తొలుత ఖండించారు. ఇదే విషయాన్ని గురువారం సెంట్రల్ క్రైమ్ బ్రాంచి (సీసీబీ) పోలీసులు వెల్లడించారు. టాలీవుడ్‌కు చెందిన మరో నటి ఆషీరాయ్ కూడా పార్టీకి హాజరైనట్టు తెలిపారు. అయితే ఆమె డ్రగ్స్ తీసుకున్నారా? లేదా అనే విషయం తెలియాల్సి ఉన్నట్టు పేర్కొన్నారు. పార్టీకి హాజరైన 103 మంది రక్త నమూనాలను నార్కొటిక్ పరీక్షలకు పంపగా, ఇందులో 59 మంది పురుషులు, 27 మంది మహిళలకు పాజిటివ్‌గా నిర్ధారణ అయినట్టు వివరించారు. వారందరికీ నోటీసులిచ్చి విచారణకు పిలుస్తామని తెలిపారు. విశ్వసనీయవర్గాల సమాచారం మేరకు కోర్టు నుంచి సెర్చ్ వారెంటు తీసుకున్నాకే ఆదివారం జీఆర్ ఫామ్‌హౌజ్‌లో జరుగుతున్న పార్టీపై దాడులు జరిపామని, తాము వెళ్లే సమయానికి నృత్యాలు చేస్తూ, తాగుతూ కొందరు మత్తులో తూలుతున్నారని పోలీసులు తెలిపారు. అదే రోజు పార్టీలో 17 ఎండీఎంఏ మాత్రలు, కొకైన్, హైడ్రో గంజాయి, ఇతర మత్తు పదార్థాలను స్వాధీనం చేసుకున్నట్టు వెల్లడించారు. రేవ్ పార్టీలో డ్రగ్స్ బయటపడటంతో, ఈ పార్టీ నిర్వాహకులు సెక్స్ రాకెట్‌ను కూడా నిర్వహిస్తున్నారా? అనే కోణంలోనూ దర్యాప్తు కొనసాగిస్తున్నట్టు వివరించారు. ఈ కేసులో ఇప్పటివరకూ ఐదుగురిని అరెస్టు చేశారు.

#### పూరింటి నుంచి విల్లాకు

లంకపల్లి వాసు అనే వ్యక్తి 'సన్‌సెట్-సన్‌రైజ్' పేరిట ఈ రేవ్ పార్టీని నిర్వహించినట్టు పోలీసులు ఎఫ్‌ఐఆర్‌లో నమోదు చేశారు. నిందితుల జాబితాలో ఇతడిని ఏ1గా చేర్చారు. ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ వన్‌టౌన్‌లోని ఆంజనేయవాగు కొండపై గతంలో ఒక పూరింట్లో వాసు కుటుంబం నివాసం ఉండేదని స్థానికులు చెప్తున్నారు. క్రికెట్ బెట్టింగ్‌లో పూర్తిపట్టు సాధించిన వాసు.. తక్కువకాలంలోనే కోట్లు సంపాదించి, ఇండ్లు, విల్లాలను కొనుగోలు చేసినట్టు తెలుస్తున్నది. అయితే, రేవ్‌పార్టీలో డ్రగ్స్‌తోపాటు తారలు పట్టుబడటంతో వాసుకు సినీ ఇండస్ట్రీతోపాటు డ్రగ్స్ సరఫరా ముఠాతోనూ దగ్గరి పరిచయాలు ఉన్నట్టు పోలీసులు అనుమానిస్తున్నారు.

# మందుల్లేవ్!

మొదటిపేజీ తరువాయి...

ఇవ్వడం లేదని, దీంతో కంపెనీలకు నగదు చెల్లించలేక చేతులెత్తేసినట్టు చెప్తున్నారు. ఈ విషయంపై ముఖ్యమంత్రికి, వైద్యారోగ్యశాఖ మంత్రికి, ఇతర ఉన్నతాధికారులకు వినతిపత్రాలు ఇచ్చినా చెల్లింపులు జరగడం లేదని వాపోయారు.

#### అడుగంటుతున్న నిల్వలు

సాధారణంగా ప్రభుత్వం మూడు నెలలకు సరిపడా మందులను నిల్వ ఉంచుతుంది. డిస్ట్రిబ్యూటర్లు సరఫరా నిలిపివేసినా.. గతంలో నిల్వ ఉంచిన ఔషధాలతో ఇప్పటివరకు నెట్టుకొస్తున్నట్టు తెలుస్తున్నది. ఈ నిల్వలు కూడా అడుగంటిపోతుండటంతో అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్టాక్ కావాలని అడిగితే వెంటనే మందులు రావడం లేదని వైద్యులు చెప్తున్నారు. నాలుగైదు రోజుల తర్వాత కొంత మేరే స్టాక్ వస్తున్నదని వాపోతున్నారు. జ్వరం, జలుబు వంటి చిన్న వ్యాధులు, బీపీ, మధుమేహ రోగులకు ఇచ్చే నిరంతర ఔషధాలకు పెద్దగా ఇబ్బంది లేదని, దవాఖాన చికిత్సల్లో వాడే ప్రాణాధార మందులకు మాత్రం కొరత ఏర్పడిందని తెలిపారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే ఒకటి రెండు వారాల్లో అన్నిరకాల మందులకు కొరత ఏర్పడటం ఖాయమని చెప్తున్నారు. మందుల కొరత విషయంపై టీఎస్‌ఎంఎస్‌ఐడీసీ అధికారులను వివరణ కోరగా.. నిల్వలకు ఇబ్బంది లేదని చెప్తున్నారు. ఎన్నికల ప్రచారం, పోలింగ్ ముగిసిన నేపథ్యంలో ఇప్పటికైనా వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఇప్పటికైనా చొరవ తీసుకొని, సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

> **ఆర్డర్లే తప్ప చెల్లింపులు లేవు**
>
> మా సంస్థ ప్రధానంగా హిమోఫీలియా ఫ్యాక్టర్ 7,8,9ని ప్రభుత్వానికి సరఫరా చేస్తుంది. రూ.3.50 కోట్ల విలువైన మందులు సరఫరా చేయాలని ప్రభుత్వం నుంచి కొనుగోలు ఆర్డర్ వచ్చింది. అప్పటికే ప్రభుత్వం నుంచి రావాల్సిన రూ.4 కోట్ల బిల్లులు పెండింగ్ ఉన్నది. అయినా బ్యాంకుల్లో, బయట అప్పులు చేసి మరీ కంపెనీల నుంచి కొనుగోలు చేసి మందులను సరఫరా చేశాం. ఇప్పటివరకు చేసిన కొనుగోళ్లకే మా దగ్గర నిధులు పూర్తిగా ఆవిరయ్యాయి. బ్యాంకుల నుంచి ఓవర్‌డ్రాఫ్ట్ కూడా తీసుకునే అవకాశం లేకుండా పోయింది. దీంతో సరఫరా నిలిపివేయాల్సి వచ్చింది.
>
> - పీ గిరీశ్ భట్, మెడిహాక్స్ ఫార్మాస్యూటికల్స్

### ఆదిమానవుల ఆనవాళ్లు



సిద్దిపేట జిల్లా ధూళిమిట్ట మండలంలోని బెక్కల్ గుట్టకు పడమటి దిక్కున ఆది మానవుల ఆవాసం, ఇనుము పరిశ్రమను గుర్తించినట్టు చరిత్ర పరిశోధకుడు రెడ్డి రత్నాకర్‌రెడ్డి తెలిపారు. గుట్టపై రోళ్లను, గుట్ట కింద నాగదేవత విగ్రహాన్ని పరిశీలించారు.

- మద్దూరు (ధూళిమిట్ట)

### ఇసుక దందా జరగలేదట!

#### మైనింగ్‌శాఖ డైరెక్టర్ వివరణ

జనగామ, మే 23 (నమస్తే తెలంగాణ) : చీటకోడూరు దేవాదుల రిజర్వాయర్ ఫేజ్-1 చెక్ డ్యాం నుంచి ఇసుక అక్రమ రవాణా జరగలేదని మైనింగ్ డైరెక్టర్ వివరణ ఇచ్చారు. 'ఇష్టారీతిన ఇసుక దందా' అంటూ 'నమస్తే తెలంగాణ'లో ఈనెల 22న ప్రచురితమైన కథనానికి రాష్ట్ర మైనింగ్ శాఖ స్పందించింది. ఇసుక అక్రమ రవాణాపై రాష్ట్ర డైరెక్టర్ ఆదేశాలతో జిల్లా మైనింగ్ శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించారు. అక్కడ ఇసుకదందా జరగడంలేదని..అధికారులు సందర్శించిన సమయంలో ఎలాంటి డంపులు ఆ ప్రాంతంలో లేవని ఏడీ పేర్కొన్నారు. ఇదంతా గతంలో జరిగిందని.. అవి అప్పటి ఫొటోలని ఒక ప్రకటనలో వివరణ ఇచ్చారు. ప్రస్తుతం ఆ ప్రాంతంలో నీటిపారుదలశాఖ పనులు సాగుతున్నాయని తెలిపారు.

### తూడుకుర్తిలో చిరుత ప్రత్యక్షం



నాగర్‌కర్నూల్ జిల్లా తూడుకుర్తి శివారులో చిరుత ప్రత్యక్షమైంది. బిజినేపల్లి మండలం సల్కర్‌పేట ఫారెస్టులో కొద్ది రోజులుగా చిరుత సంచారంతో సమీప గ్రామాల ప్రజలు భయాందోళన చెందుతున్నారు. గురువారం ఎల్వీ ప్రసాద్ కంటి దవాఖాన వెనుక భాగంలో వ్యవసాయ పొలాలకు వెళ్లే రైతుల కంటపడింది. జింక పిల్లను తరుముతూ కనిపించడంతో రైతులు భయపడ్డారు. ఈ ప్రాంతంలో దాదాపు నాలుగు చిరుతలు తిరుగుతున్నట్టు స్థానికులు తెలిపారు. -నాగర్‌కర్నూల్




కరీంనగర్ జిల్లా రూరల్ మండలంలోని తాయరుకొండ గ్రామంలో నిరుడు మే నెలలో నిండుగా ఉన్న చెరువు




ప్రస్తుత మే నెలలో ఎండిపోయిన తాయరుకొండ చెరువు

## నేటినుంచి తెరుచుకోనున్న జీవన్‌మాల్

- ఆర్టీసీకి వ్యతిరేకంగా హైకోర్టు ఉత్తర్వులు
- న్యాయం గెలిచిందన్న జీవన్‌రెడ్డి



ఖలీల్‌వాడి, మే 23: నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లోని జీవన్‌రెడ్డి మాల్‌ను సీజ్ చేసిన ఆర్టీసీకి హైకోర్టు షాక్ ఇచ్చింది. మాల్‌ను యథావిధిగా తెరుచుకోవచ్చని కోర్టు ఉత్తర్వులు జారీ చేసిందని ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి తెలిపారు. సిద్దులగుట్ట స్వామి ఆశీస్సులతో శుక్రవారం నుంచి మాల్‌ను తిరిగి తెరువనున్నట్టు ఆయన ఓ ప్రకటనలో పేర్కొన్నారు. న్యాయం గెలిచిందని, ధర్మం నిలబడిందన్న జీవన్‌రెడ్డి.. అన్యాయంగా, అకారణంగా మాల్‌ను జప్తు చేసిన ఆర్టీసీకి హైకోర్టు ఉత్తర్వులతో షాక్ తగిలినట్టు అయిందని తెలిపారు. ఇక నుంచి జీవన్‌మాల్‌లో యథావిధిగా కార్యకలాపాలు కొనసాగుతాయని పేర్కొన్నారు.